ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 29 ఏప్రిల్ 2024

రమ్య, రష్మిక.. ఓటేయలేదు ..!

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఒకప్పటి కన్నడ ప్రముఖ హీరోయిన్, మండ్య మాజీ ఎంపీ రమ్య అలియాస్ దివ్యస్పందన ఓటు వేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మండ్యలోని పీఎల్‌డీ బ్యాంకు పోలింగ్‌బూత్‌లో రమ్యకు ఓటు ఉండేది. అయితే ఓటు హక్కు వినియోగించుకునేందుకు హాజరు కాలేదు. ఇక నటి రష్మికా మందణ్ణ సౌత్ ఇండి యాలో బిజీ హీరోయిన్‌గా ఉన్నారు. కొడగు జిల్లాలో ఆమె ఓటు వేయాల్సి ఉండేది. ఇద్దరూ ఓటు వేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇండియా కూటమికి అధికారమిస్తే..

ఏడాదికో ప్రధాని



● సుస్థిర ప్రభుత్వం బీజేపీతోనే సాధ్యం ● ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ● రాష్ట్రంలో సుడిగాలి పర్యటన
● ఉదయం బెళగావి, మధ్యాహ్నం శిరసి, దావణగెరె... సాయంత్రం హొసపేట సభల్లో ప్రచారం

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం దిశగా ప్రజలు ఆలోచిస్తున్నారని, ఐఎన్‌డీఐఏ కూటమికి నాయకులే లేరని వారు గెలిస్తే ఏడాదికో ప్రధాని అవుతారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఆదివారం రాష్ట్రంలో మోదీ రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం 10 గంటలకు బెళగావి సభలోనూ, మధ్యాహ్నం 12 గంటలకు శిరసిలోనూ, 2 గంటలకు దావణగెరెలోనూ, సాయంత్రం హొస్పేట సభలో పాల్గొన్నారు. ప్రధాని శనివారం రాత్రి బెళగావికి చేరుకున్నారు. అక్కడ బస చేసిన ప్రధాని ఉదయం వివిధ జిల్లాల ముఖ్యనేతలతో అల్పాహార విందులో పాల్గొన్నారు. ఆ తర్వాత బహిరంగసభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓ వర్గానికి మేలు చేయడమే లక్ష్యమని, బీజేపీ ఏం చేసినా విమర్శలు చేస్తారన్నారు. కొవిడ్ వేళ బీజేపీ వ్యాక్సిన్ అని ప్రచారం చేశారన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాబలమని, ఓడితే ఈవీఎంల గోల్‌మాల్ అని ఆరోపిస్తారన్నారు. ఈవీఎంలపై సుప్రీంకోర్టు ఇదివరకే స్పష్టత ఇచ్చిందన్నారు. బీజేపీ పదేళ్లలో సుస్థిరమైన ప్రభుత్వం ద్వారా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తూనే అరాచకాలు, హత్యలు పెరిగాయన్నారు. చిక్కోడిలో జైనముని హత్య, బెళగావిలో మహిళను వివస్త్రను చేసి దాడి చేయడం, హుబ్బళ్ళిలో విద్యార్థిని క్యాంపస్‌లో దారుణహత్య, హోటల్‌లో బాంబు పేలుళ్లు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌కు పాలన చేతకాకుంటే రాజీనామా చేయాలన్నారు. పీఎఫ్ఐతో ఒప్పందం చేసుకుందని మండిపడ్డారు. దేశంలో స్వాతంత్ర్యానికి ముందు రాజరికం ఉండేదని అయితే ఎంతోమంది రాజులు తమ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కాంగ్రెస్ అధికారం కోసం నీచ రాజకీయాలు చేస్తోందన్నారు. ఇటీవలి పదేళ్లలో 10కోట్లమంది మహిళలు స్వయం సంఘాలకు ద్వారా ఆర్థిక చేదోడు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ పగటి కలలు కంటోందని, పిత్రార్జిత ఆస్తికి కొత్త చట్టం తీసుకొస్తామనే ప్రస్తావన వారి ఆలోచనలో దాగియున్న ద్వేషమన్నారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాధించేందుకు ప్రజలు ఆశీర్వదించాలన్నారు. జగదీశ్‌శెట్టర్, అన్నాసాహెబ్ జొల్లెలను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ కోరె, ఈరణ్ణకడాడి, ఎంపీ మంగళ అంగడి పాల్గొన్నారు.



బెళగావి సభలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

రామ్ లల్లాను అవమానించిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ రామ్‌లల్లాను అవమానించారని మండిపడ్డారు. ఉత్తరకన్నడ జిల్లా శిరసిలో విజయసంకల్ప పేరిట జరిగిన ప్రచారసభలో ప్రధాని మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు, భక్తులు ఇచ్చిన విరాళాలతో భవ్యమందిరం సాధ్యమైందన్నారు. కాంగ్రెస్, అనుబంధ పార్టీలు రామమందిర నిర్మాణాన్ని అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనకు 500ఏళ్లు పట్టిందన్నారు. లక్షలాదిమంది ప్రాణత్యాగం చేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మందిర నిర్మాణం జరగాల్సి ఉండేన్నారు. కానీ ఇదో పవిత్రపుణ్యకార్యమన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతోనే అది సాధ్యమైందన్నారు. ప్రపంచమే భారత్‌వైపు చూసేలా పాలన సాగించామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడ్డామన్నారు. మీ ఆస్తులపై ఎక్స్‌రే చేసి దోచుకునే ఆలోచన కాంగ్రెస్‌కు ఉందని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ఒక అవినీతి మరకలేకుండా ప్రభుత్వాన్ని కొనసాగించామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎంతటి అరాచకాలు జరిగాయో తెలుసుకోవాలన్నారు. ఉత్తరకన్నడ అభ్యర్థి విశ్వేశ్వర హెగ్డే కాగేరిని గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సునిల్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



దావణగెరె సభకు హాజరైన జనం

అన్నదాతకు కాంగ్రెస్ అన్యాయం

రాష్ట్రంలో అన్నదాతకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కిసాన్ సమ్మాన్ యోజనకు అడ్డు తగిలారన్నారు. దావణగెరె సభలో ప్రధాని ప్రసంగిస్తూ ఒకప్పుడు పంటలబీమాకు జాబితా పంపకుండా ఇబ్బంది కలిగించారని ఇటీవల కిసాన్ సమ్మాన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇచ్చిన రూ.4వేలలోనూ కోత విధించారన్నారు. ప్రస్తుతం కేంద్రం నుంచి ఇచ్చే రూ.6వేలు మాత్రమే దక్కుతోందన్నారు. కర్ణాటకలో ప్రతిచోటా మరోసారి మోదీ అనే ధ్వని వినిపిస్తోందన్నారు. జూన్ 4న రాష్ట్రమంతటా విజయోత్సవాలు జరగాలన్నారు. దావణగెరెలో వెన్నదోసె సంబరం సాగాలని సూచించారు. డిగ్రీ చదువుతూనే నైపుణ్యత కల్పించాలని నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యతిరేకించిందన్నారు. దేశ సురక్షత అభివృద్ధి కోసం పాటుపడ్డానన్నారు. పదేళ్లలో జాతీయ రహదారుల సంఖ్య, విమానాశ్రయాలు, ఓడరేవులు, రైళ్ల అధునికీకరణ చేపట్టామన్నారు. రెండు రోజులక్రితం జరిగిన పోలింగ్‌లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పారని, మరో వారంలో జరిగే పోలింగ్‌లోనూ అదే తరహాలోనే గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు అభ్యర్థి గాయత్రి సిద్దేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. మాజీ సీఎం యడియూరప్ప, బసవరాజ్ బొమ్మై, ఎంపీ సిద్దేశ్వర్, మాజీ డీసీఎం గోవింద కారజోళ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హొస్పేట సభలో ప్రధాని భాగస్వామ్యులయ్యారు.

ఓపెన్ డ్రైవ్..

● రాష్ట్రంలో కలకలం రేపిన ప్రజ్వల్ పెన్‌డ్రైవ్‌లు ● వీడియోల వైరల్‌తో ఖంగుతిన్న జేడీఎస్ నేతలు ● వెల్లువెత్తిన మహిళా సంఘాల నిరసనలు



ప్రజ్వల్ రేవణ్ణ

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్‌డ్రైవ్‌ల రాజకీయం హోరందుకుంది. హాసన్ జేడీఎస్ ఎంపీ, ప్రస్తుత బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన అశ్లీల పెన్‌డ్రైవ్‌లు రాష్ట్ర రాజకీయాలను కుదిపేశాయి. కొన్ని రోజులుగా సాగుతున్న వివాదం రెండు మూడు రోజుల్లోనే పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. హాసన్‌లోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ పలువురు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లుగా ఉండే వీడియోలు వైరల్ అయ్యాయి. ఎన్నికల ప్రచారం వేళనే ఈ అంశం బహిరంగమైనా కేవలం పెన్‌డ్రైవ్‌ల ద్వారానే హాసన్ వ్యాప్తంగా హల్‌చల్ చేశాయి. హాసన్‌లోని పార్క్‌లు, రోడ్లవెంబడి మైదానాలలో ఎటు చూసినా పెన్‌డ్రైవ్‌లు కనిపించాయి. దీంతో స్థానిక మహిళల్లో భయం పట్టుకుంది. పెన్‌డ్రైవ్‌లో ఉన్న ఓ బాధితురాలు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో మహిళా కమిషన్ చైర్మన్ సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశారు. దీంతో ప్రత్యేక సిట్‌కు సీఎం ఆదేశించారు. ఈ పరిణామాలు కొనసాగుతున్న తరుణంలోనే ప్రజ్వల్ రేవణ్ణ జర్మనీకి పరారీ అయ్యారు. ఆదివారం హోం మంత్రి పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. నిందితుడిగా భావిస్తున్న ప్రజ్వల్ దేశం నుంచి పరారీ అయ్యారని సిట్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)లో ఏడీజీపీ విజయ్‌కుమార్ సింగ్, ఎస్పీ సుమన్ డీ పర్నేకర్, మైసూరు ఎస్పీ సీమా లాట్కర్‌లతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈమేరకు ప్రజ్వల్‌పై హొళెనరసీపుర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీ 354 (ఏ), లైంగిక వేధింపులు, 354 (డీ) మహిళలను వేధించడం, బెదరించడం, 506 మహిళల మర్యాదకు భంగం కలిగించడం 509 సెక్షన్‌లకింద నమోదు చేసి దర్యాప్తుకు సిద్ధమయ్యారు.

పార్టీ నుంచి వేటు తప్పదా..?

ప్రజ్వల్ రేవణ్ణ తండ్రి ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపైనా హొళెనరసీపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. హెచ్‌డీ రేవణ్ణ నుంచి కూడా లైంగిక దౌర్జన్యం జరిగిందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొనడంతో ఆయనపైనా కేసు నమోదైంది. ఫిర్యాదు చేసిన మహిళ 2015 నుంచి రేవణ్ణ ఇంట్లో పని మనిషిగా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. భవాని రేవణ్ణ ఇంట్లో లేనప్పుడు దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజ్వల్ అరాచకాలు నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బెంగళూరులో ఆందోళన చేశారు. ప్రజ్వల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐసీసీ అధికార ప్రతినిధి భవ్య నరసింహమూర్తి కేపీసీసీలో మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రంలో పర్యటిస్తున్నారని, ప్రజ్వల్ అశ్లీలతపై ఎందుకు స్పందించలేదన్నారు. ఇతర మతాలకు చెందినవారైతే మాట్లాడేవారా..? అంటూ ప్రశ్నించారు. విద్యార్థిని నేహా హిరేమఠ హత్యను ఖండించామని, అదే తరహాలోనే ప్రజ్వల్ రేవణ్ణ చేసిన అరాచకాలు దేశ చరిత్రలోనే ఏ ప్రజాప్రతినిధి చేయలేదని ఆరోపించారు. అధికార మదంతో ఇలా వ్యవహరించారని మండిపడ్డారు. బాధిత మహిళలు ఒకరిద్దరు కాదని వందలమంది ఉన్నారన్నారు. ప్రజ్వల్ వివాదంపై కుమారస్వామి స్పందించారు. ఉప్పు తినింటే నీరు తాగాల్సిందేనన్నారు. దేవెగౌడతోపాటు తాను కూడా మహిళలంటే ప్రత్యేక అభిమానం ఉన్నవారమన్నారు. ఈ విషయంలో ప్రజ్వల్ తప్పు చేసి ఉంటే తగిన చర్యలు ఉంటాయన్నారు. అయితే పార్టీ నుంచి వేటు వేసే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కోర్ కమిటీ చైర్మన్ జీటీ దేవెగౌడ తెలిపారు.



మైసూరుబ్యాంకు సర్కిల్‌లో రేవణ్ణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ఇలా..



విధానసౌధ ప్రాంగణంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన

కరువు పరిహారంపై మరోసారి సుప్రీంకు

● రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా ● ఖాళీ చెంబులతో విధానసౌధ వద్ద నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చెంబు మిగిల్చిందని రెండు వారాలుగా ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ అదే కోణంలో ఆదివారం అదే తరహాలోనే నిరసనకు దిగింది. శనివారం కేంద్రప్రభుత్వం కరువు పరిహార నిధి కింద 3,454 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రానికి కరువు పరిహారం దక్కడంపై సీఎం సిద్దరామయ్య సంతృప్తి వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు జోక్యంతోనే రాష్ట్ర రైతులకు పరిహారం లభించిందన్నారు. అయితే కేంద్రంనుంచి విడుదల చేసిన గ్రాంటు తక్కువ అంటూ పార్టీ ఆందోళన చేయాలని తీర్మానించింది. అందుకు అనుగుణంగానే ఆదివారం విధానసౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సహా పలువురు విధానసౌధ మెయిన్‌గేట్ నుంచి ఖాళీ చెంబులు చేతబట్టి మరోసారి కేంద్రంలోని బీజేపీ చెంబు మిగిల్చిందని నినాదాలు చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ కేంద్రం కర్ణాటకపట్ల నిరంతరంగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 2023 ఖరీఫ్, రబీ పంటల కాలంలో పూర్తిగా పంటల సాగు సాధ్యం కాలేదన్నారు. వర్షాభావంతో ప్రాజెక్టులు ఎండిపోయాయన్నారు. రాష్ట్రంపై వరుణుడు చిన్నచూపు చూశారని రాష్ట్రమంతటా కరువు తాండవం చేస్తోందన్నారు. ఆరు నెలలుగా పరిహారం కోసం కేంద్రం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించామన్నారు. వారంరోజుల క్రిందటే సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు పరిహారంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. కానీ రాష్ట్రానికి ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం 18వేలకోట్లకు పరిహారం రావాల్సి ఉండగా కేవలం రూ.3,454 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేయడమే కేంద్రప్రభుత్వం లక్ష్యమన్నారు. కాగా జేడీఎస్ నేత కుమారస్వామి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవలే సీఎం సిద్దరామయ్య ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.4,860 కోట్లు విడుదల చేస్తే చాలని అభిప్రాయ పడ్డారన్నారు. కేంద్రప్రభుత్వం రూ.3,454 కోట్లు విడుదల చేస్తే ప్రస్తుతం రూ.18,172 కోట్లు కోరామని కేంద్రం తప్పు చేసినట్లుగా ప్రచారం చేస్తోందన్నారు. కేవలం రాజకీయం కోసమే కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందన్నారు. నిరసనలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కేంద్రం నిబంధనలు పాటించలేదు..

కరువు పరిహారం విడుదలలో కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి నిర్లక్ష్యం చేసిందని ప్రభుత్వం తరఫున మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా అభిప్రాయపడ్డారు. దావణగెరెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం రాష్ట్ర రైతులకు 18,172 కోట్ల రూపాయల పరిహారం రావాల్సి ఉండేదన్నారు. కానీ కేంద్రం 3,454 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు.



అబద్ధాలు చెప్పే ప్రధానికి సిగ్గు లేదు : సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు చెప్పే ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సిగ్గు లేదని, నోరు తెరిస్తే అన్నీ అవాస్తవాలే అని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. బెళగావి జిల్లా కాగవాడ తాలూకా ఉగాడకుర్ద గ్రామంలో ఆదివారం చిక్కోడి కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక జార్కిహొళి తరపున సీఎం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాణి చెన్నమ్మ, ఛత్రపతి శివాజీలకు కాంగ్రెస్ మోసం చేసిందని ప్రధాని చెప్పడం సరికాదన్నారు. తామెప్పుడూ వారిని అవమానించలేదన్నారు. రాణి చెన్నమ్మ జయంతి ఉత్సవాలను ప్రారంభించింది తమ పాలనలోనన్నారు. యడియూరప్ప, బొమ్మై పాలనలో ఉత్సవాలను విస్మరించారన్నారు. బీసీలకు రిజర్వేషన్ కోటాలో కోతపెట్టి ముస్లింలకు ఇస్తారనేది తప్పు అన్నారు. 1994లో దేవె గౌడ ముఖ్యమంత్రిగాను, తాను ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామన్నారు. బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నప్పుడు వాటికి కోత విధించి లింగాయత, ఒక్కలిగలకు 2శాతం చొప్పున పంచారన్నారు. పదేళ్లలో మీ విజయాలు ఏమిటో చెప్పాలని, తాళి, గాజులు, ముస్లింలు వంటి అంశాలు ప్రస్తావించరాదని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థులు సునాయాసంగా గెలుపొందుతారన్న ధీమా వ్యక్తం చేశారు. మంత్రి సతీశ్ జార్కిహొళి, అభ్యర్థి ప్రియాంకజార్కిహొళి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



జాతరలో మూడు రథాల ఊరేగింపు

వైభవంగా మహాకాళియమ్మ రథోత్సవం

దొమ్మసంద్ర, ఏప్రిల్ 28: ఐదేళ్లకోసారి నిర్వహించే మహాకాళియమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అనేకల్ తాలూకాలోని మరసూరు, శెట్టిహళ్ళి, హళేఊరు గ్రామస్థులంతా చేరి బండి మహాకాళియమ్మ జాతరను వైభవంగా నిర్వహిం చడం ఆనవాయితీ. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు జాతరకు తరలివస్తుంటారు. మరసూరు గ్రామంలో ప్రత్యేకించి మూడు తేర్లను ఊరేగించడం ఇక్కడి విశేషం. జాతర ఆదివారం కొనసాగడంతో సాధారణంకంటే పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి ఇంటి వద్ద పందిరివేసి అన్నదానం నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఎంతమంది వచ్చినా లేదనకుండా వడ్డిస్తారు. ఇలా మూడు శతాబ్దాలుగా ప్రతి ఐదేళ్లకోసారి ఇక్కడ జాతర కొనసాగుతోందని మరసూరు గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు పురుసోత్తమ రెడ్డి తెలిపారు. బండి మహాకాళియమ్మకు ఉదయం విశేషపూజలు నిర్వహించారు. ఎటు చూసినా భక్తుల సందడి నెలకొంది.

విషాదం నింపిన సెల్ఫీ సరదా

● చెరువులో పడి తండ్రీకూతురు మృతి

బంగారపేట, ఏప్రిల్ 28: సెల్ఫీ సరదా ఓ కుటుంబంలో విషాదం నింపింది. సెల్ఫీ తీసుకునే క్రమంలో చెరువులో జారిపడ్డ కూతురును కాపాడేందుకు ప్రయత్నించిన తండ్రి కూడా మృతిచెందాడు. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బంగారపేట తాలూకాలోని కామసముద్ర సమీపంలో ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. కామసముద్ర గ్రామానికి చెందిన ఇంతియాజ్ ఇంటికి బంధువులు వచ్చారు. దీంతో వారితో కలిసి సరదాగా కామసముద్ర చెరువు వద్దకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. ఇంతియాజ్ కూతురు ఫాతిమా(10) సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లి కాలుజారి చెరువులో పడింది. కాపాడేందుకు ప్రయత్నించిన తండ్రి అయూబ్(35) కూడా నీట మునిగారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. కామసముద్ర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఎన్నికల్లో పిల్లలతో పనులు చేయిస్తే చర్యలే

ఎన్నికలప్రక్రియలో పిల్లలతో పనులు చేయించరాదని కమిసన్ చెబుతోంది. నిబంధనల మేరకు 18 సంవత్సరాల లోపు పిల్లలతో ఎలాంటి ఎన్నికల పనులు చేయించరాదు. బాలకార్మిక చట్టం ప్రకారం ఎన్నికల కార్యాలయాల్లో పనులు చేయించుకున్నా, కరపత్రాలు పంపిణీ చేసినా, ఫ్లెక్సీలు, జెండాలు కట్టించినా, ప్రచారంలో తిప్పినా సంబంధిత నాయకులు, కార్యకర్తలపై నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవచ్చు. పిల్లలను పనులకోసం ప్రోత్సహించే తల్లిదండ్రులను కూడా దోషులుగా పరిగణిస్తారు. తీవ్రత ఆధారంగా అభ్యర్థులపై కేసులు నమోదు చేసే అవకాశాలుంటాయి. - **బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)**

బాగల్కోటె బరి..
హోరాహోరీ



● సీనియర్, జూనియర్‌ల మధ్య పోరు ● ఐదోసారి విజయం కోసం గద్దిగౌడర్
● తొలిసారి బరిలో సంయుక్తా పాటిల్ ● కాంగ్రెస్ గ్యారెంటీలపైనే ఆశలన్నీ..



పీసీ గద్దిగౌడర్



సంయుక్తాపాటిల్

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె బరిలో ఆసక్తికరమైన పోరు సాగుతోంది. సీనియర్ లోక్‌సభ సభ్యుడు పీసీ గద్దిగౌడర్‌తో తొలిసారి రాజకీయంలోకి అడుగుపెట్టిన సంయుక్తా పాటిల్ పోటీ పడుతున్నారు. పీసీ గద్దిగౌడర్ బీజేపీ అభ్యర్థిగా 2004 నుంచి వరుసగా గెలుపొందుతూ వచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా మంత్రి శివానంద పాటిల్ కుమార్తె సంయుక్తాపాటిల్ పోటీ చేస్తున్నారు. పీసీ గద్దిగౌడర్ ప్రస్తుత ఎన్నికల్లో టిక్కెట్ తప్పుతుందనే ప్రచారంతో పలువురు ప్రయత్నించారు. చివరకు ఆయనకే టిక్కెట్ వరించడంతో ఆశించినవారందరినీ అక్కున చేర్చుకునేందుకు ఆయన కొంతశ్రమపడాల్సి వచ్చింది. కాంగ్రెస్‌లో టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి గత ఎన్నికల్లో ఓటమి చెందిన వీణాకాశప్పనవర్‌కు పరాభవమే ఎదురైంది. వీణా కాశప్పనవర్ ఒకానొకదశలో రెబెల్‌గా మారుతారనే ప్రచారం సాగింది. స్వయంగా సీఎం సిద్దరామయ్య రంగంలోకి దిగి రాజీ చేశారు.

● బాగల్కోటె ఎన్నికల్లో ప్రతిసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చుతూ వచ్చినా గద్దిగౌడర్‌ను ఢీ కొట్టలేకపోయారు. ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉండే బాగల్కోటె ప్రస్తుతం బీజేపీకి బలమైన నియోజకవర్గంగా మారింది. ఎన్నికలు ప్రధాని నరేంద్రమోదీ వర్సెస్ కాంగ్రెస్ అనేలా సాగుతున్నా కులరాజకీయమే కీలకమైంది. లింగాయత ఓట్లను రెండు పార్టీలు నమ్ముకున్నారు. గద్దిగౌడర్ తరపున ఇప్పటివరకు రాష్ట్రనాయకులుగానీ జాతీయనాయకులుగానీ ఎవరూ ప్రచారం చేయలేదు. కేవలం ఆయనే నియోజకవర్గవ్యాప్తంగా సుడిగాలిలా తిరుగుతున్నారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాగల్కోటె ఎన్నికల ప్రచారసభలో పాల్గొంటున్నారు. కాగా ప్రధాని సభ తర్వాత కాంగ్రెస్ అగ్రనేత్రి ప్రియాంకవాద్రాను నియోజకవర్గానికి రప్పించే ప్రయత్నాలు కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్నాయి. సీఎం సిద్దరామయ్య రెండు రోజులక్రితం బాగల్కోటె బహిరంగసభ నిర్వహించారు. గద్దిగౌడర్ నాలుగుసార్లు ఎంపీగా కొనసాగిన వేళ కుడచ్చి - బాగల్కోటె రైలు మార్గం ఏర్పాటు, రహదారుల నిర్మాణం ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సంయుక్తా పాటిల్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీల లబ్ధిదారులైన మహిళా ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నారు. సంయుక్తా పాటిల్ సోదరుడు ఇటీవల బీజేపీలో చేరడం ఆమెకు ఎదురుదెబ్బ అవుతోంది.

● బాగల్కోటె లోక్‌సభ పరిధిలో ముధోళ (కాంగ్రెస్), బీళగి (కాంగ్రెస్), బాగల్కోటె (కాంగ్రెస్), హునగుంద (కాంగ్రెస్), బాదామి (కాంగ్రెస్), జమఖండి (బీజేపీ), తెరదాళ (బీజేపీ), నెరగుంద (బీజేపీ) ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇలా ఐదుగురు కాంగ్రెస్, ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు 18,06,183మంది ఓటర్లు కాగా మహిళలు 9,10,650మంది, పురుషులు 8,95,432మంది, ట్రాన్స్‌జెండర్ 101మంది ఉన్నారు. 2019 ఎన్నికల్లో పీసీ గద్దిగౌడర్ 6,64,635 ఓట్లు సాధించగా కాంగ్రెస్ వీణా కాశప్ప 6,96,451 ఓట్లు పొందారు. 1,68,187 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

● పీసీ గద్దిగౌడర్ నాలుగుసార్లు ఎంపీగా కొనసాగారని, సీనియర్‌రాజకీయ నేత అనే పేరుంది. అజాతశత్రువు, సౌమ్యస్వభావం, వివాదాలకు దూరంగా ఉంటారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిష్మా కలసిరానుంది. ఆయన మైనస్‌లలో నియోజకవర్గాల్లో ఆశించినంత అభివృద్ధి సాధించలేకపోయారని, బీజేపీ ముఖ్యనేతల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి సంయుక్తాపాటిల్‌కు తండ్రి శివానంద పాటిల్ మంత్రి కావడంతో గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. విద్యావంతులురాలు, యువ నేత, కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలు బలం కానున్నాయి. ఆమెకు మైనస్‌లలో అనుభవం లేదని, కొత్త అభ్యర్థి కావడంతోపాటు విజయపుర జిల్లా నుంచి ఇక్కడికి వలసవచ్చి పోటీ చేయడం వంటివి వ్యతిరేకతకు కారణమవుతోంది. కాంగ్రెస్‌లో ఐక్యత లేకపోవడం కూడా ఆమెకు భారీ దెబ్బకొట్టే అవకాశం ఉంది. నియోజకవర్గంలో లింగాయత, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గీయులే అత్యధికం. లింగాయత వర్గీయులలో పంచమశాలి, గానుగ, రెడ్డి, అంతర్గత వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయియి. ఇక్కడ చేనేత, కురుబ, ముస్లింలతోపాటు పలు వెనుకబడిన వర్గాల ఓట్లు కూడా విజయానికి కీలకం కానున్నాయి.



రేపు శివమొగ్గకు జేపీ నడ్డా

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శివమొగ్గకు విచ్చేయనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తెలిపారు. శివమొగ్గలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన నడ్డా శివమొగ్గ అభ్యర్థి రాఘవేంద్ర తరపున ప్రచారం చేస్తారన్నారు. కాంగ్రెస్ అబద్ధాల హామీలతో ఓట్లు కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారన్నారు. మహిళలకు లక్ష రూపాయలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని, ఇది అసాధ్యమన్నారు. దేశంలో బడ్జెట్ రూ.45 లక్షల కోట్లుగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 68కోట్ల మహిళలు ఉన్నారన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి లక్ష రూపాయలు ఇస్తే 38 లక్షల కోట్లు అవుతుందని, మిగిలిన 7లక్షల కోట్లతో పాలన సాధ్యమా అన్నారు.

దక్షిణం పైనే
గురి



● ఉత్తరంలో ఎన్నికలు ముగియడంతో..
దక్షిణ కర్ణాటకకు పెరిగిన అగ్రనేతల రాక
● వరుసగా రాహుల్, మోదీ పర్యటనలు ● పట్టు నిలుపుకోవాలని హస్తం, పట్టుసాధించాలని కమలం

బళ్లారి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక ఎన్నికలు ముగియడంతో నేతలు దక్షిణ కన్నడపై దృష్టి సారించారు. ఇరు పార్టీల అగ్రనేతలు వరుస పర్యటనలతో రాజకీయంగా జోరు పెంచారు. ఏప్రిల్ 26న రాహుల్ గాంధీ దక్షిణ కర్ణాటక జిల్లాలో పర్యటించారు. ఆదివారం మోదీ సుడిగాలి పర్యటన చేపట్టారు. ఏప్రిల్ 26న ఉత్తర కర్ణాటక జిల్లాల్లోని 14 పార్లమెంట్ స్థానాలకు ఓటింగ్ ముగిసింది. మే 7న దక్షిన కర్ణాటక జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. శివమొగ్గ, దావణగెర, ఉత్తర కన్నడ, హావేరి, ధారవాడ, బెళగావి, చిక్కోడి, విజయపుర, బాగలకోటె, కొప్పళ, రాయచూరు, కలబురగి, బీదర్, బళ్లారి జిల్లాలో రెండవ విడత ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ఈ స్థానాల్లో బీజేపీ నేతలే అధికారంలో ఉన్నారు. అన్ని స్థానాల్లో విజయం సాధించాలని పట్టు బిగిస్తుంటే.. ఎలాగైనా తమ ఖాతాల్లోకి వేసుకోవాలని కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు.

● రెండు రోజుల క్రితం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సీఎం, సిద్దరామయ్య, తదితర అగ్రనేతలు ఎన్నిక ప్రచారం సాగించారు. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ దక్షిణ కర్ణాటక జిల్లాల్లో పర్యటించారు. దేశ వ్యాప్తంగా మోదీ హవా కొనసాగుతోంది. మోదీనే ప్రధాని కావాలని జనం కోరుకుంటున్నారు అని బీజేపీ నాయకులు ప్రచారంలో హోరెత్తిస్తున్నా రు. దేశాన్ని పెత్తందారులకు మోదీ తాక ట్టు పెట్టారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు పంచిపెట్టి, ప్రజలకు ఖాళీ చెంబు ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.

● కర్ణాటక కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలు దేశానికే ఆదర్శం అని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తుంటే, బీజేపీ మాత్రం కాంగ్రెస్ దేశాన్ని స్వాతంత్రం వచ్చిన నాటి నుండి పాలించింది. ప్రజలకు ఏమి చేసిందని ప్రశ్నిస్తోంది. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమంటున్నారు. దక్షిణ కర్ణాటకలో ఎంతో కొంత ప్రాబల్యం ఉన్న కేఆర్‌పీపీ బీజేపీలో చేరిపోయింది. జేడీఎస్ కూడా కూటమిలో కలిసిపోయింది. కాంగ్రెస్ మాత్రం ఒంటరి పోరే సాగిస్తుంది. అమిత్ షా, రాజనాథ్‌సింగ్, ఇతర బీజేపీ నాయకులు పర్యటన వివిద జిల్లాలో చేశారు.

● బళ్లారి జిల్లాలో 2023 ఏప్రిల్ నెలలో ఎమ్మెల్యే ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారానికి వచ్చారు. అప్పుడు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండేది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ప్రధాన మంత్రి హోదాలో బళ్లారి ఎంపీ స్థానంలో నియోజకవ వర్గం అయిన విజయనగర(హొస్పేట్)లో వచ్చారు. విజయనగర జిల్లాలో పీఎం లోక్‌సభ ఎన్నిక సభను ఏర్పాటు చేయడం వల్ల బళ్లారి, కొప్పళ, రాయచూరు, ఇలా మూడు జిల్లాల ప్రజలతో పాటు మరింత ఎక్కువ మంది ఎంపీ అభ్యర్థులు హాజరవుతున్నారు.

రచ్చ బండలపై రాజకీయ చర్చలు

పల్లెల్లో గెలుపోటములపై ఊహాగానాలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 28: ఓవైపు ఎండలు..మరోవైపు ఎన్నికల వేడి రాష్ట్రవ్యాప్తంగా భగభగమంటున్నాయి. ఈ తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో వేడితాపానికి తట్టుకోలేక చెట్లకింద, చెట్ల ఏర్పాటు చేసిన కట్టలు, రచ్చబండలను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడ చూసినా ఈ సారి ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది... అనేది ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన చర్చగా మారుతోంది. బీజేపీ మద్దతు దారులు నరేంద్ర మోదీ మరీ ప్రధాని కావడం ఖాయం అంటుంటే.. కాంగ్రెస్ కార్యకర్తలు ఈసారి ఇండియా కూటమికి అధికారం ఖాయం అంటున్నారు. ఇలా గ్రామాల్లో సీనియర్ సిటిజన్ల చర్చ.. సమాలోచన ద్వారా తమ పార్టీ నాయకులను మద్దతు ఇచ్చే మాటలతో గ్రామాల్లో ప్రముఖ స్థలాలు వేదికగా నిలుస్తున్నాయి. ఎండల కారణంగా ఉదయాన్నే రైతులు పొలం పనులు ముగించుకుని చెట్ల కిందకు చేరుకుంటున్నారు. చెట్లక్రింద, రచ్చబండలపై కూర్చొని రాజకీయ చర్చలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రచ్చబండలపైన ఎక్కడ చూసినా ఒకటే చర్చ... ఈ సారి కేంద్రంలో బీజేపి వస్తుందా... కాంగ్రెస్ కూటమి వస్తుందా...? రాష్ట్రంలో ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలుస్తారు.. ఏ జిల్లాలో ఎవరు గెలుస్తారు... మన జిల్లాలో ఎవరికి ఎన్నిఓట్లు వస్తాయి... ఈ సారి బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయా... కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వస్తాయా... కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వస్తే... కేంద్రంలో కాంగ్రెస్ వస్తుందా... బీజేపీ వస్తే మళ్ళీ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కష్టాలు తప్పవు... మనకు ఈ తిప్పలు తప్పవంటూ... ఎవరికి తోచిన అభిప్రాయాలతో...గంటల తరబడి చెట్లక్రింద... కూల్‌డ్రిక్ షాపులు, ఆటో స్టాండ్‌లు... ఇస్త్రీ అంగళ్ళు, బస్సుస్టేషన్, హోటళ్ళు... ఇలా ఎక్కడ కొంచెం చోటు దొరినా... నలుగురు గుమికూడితే... రాజకీయ చర్చలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.



రచ్చబండపై కూర్చున్న పల్లె జనం

అనంతకు ఇంకొక్క పరిశీలకుడు..



శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ జిల్లాలో ఎలా చేపడుతున్నారో పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల పరిశీలకు లు జిల్లాకు వస్తున్నారు. ఇప్పటికే వ్యయ పరిశీలకులు, జనరల్ పరిశీలకులు ముగ్గురు జిల్లాకు చేరుకున్నారు. తాజాగా ఆదివారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల జనరల్ పరిశీలకులు మనీష్‌సింగ్ ఐఏఎస్ అనంతకొచ్చారు. ఆయన ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉండగా అక్కడకు కలెక్టరు వినోద్ కుమార్ వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిశీలకులు తమ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణ అక్కడి పరిస్థితులు గురించి కలెక్టరు ద్వారా అడిగి తెలుసుకున్నారు.

'ఆదరణ' ఏదీ..?



శింగనమల: టీడీపీ పాలనలో కులవృత్తులతో జీవనోపాధి పొందే వారు ఆర్థికంగా నిలుదొక్కుకోవడానికి ఆదరణ పథకం కింద పనిముట్లు అందజేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆపథకం ఎత్తివేశారు. అప్పట్లో చంద్రబాబునాయుడు కులవృత్తులు చేసేవారికి ఉచితంగా ఆదరణ పథకం కింద పనిముట్లు ఇచ్చారు. మా కుటుంబానికి కూడా రెండు కుర్చీలు వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ కుర్చీ ద్వారానే కులవృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నా. జగన్ వచ్చాక చేయూత పేరుతో ఏడాదికి రూ.10వేలు ఇస్తున్నాడు. మేము నాలుగురు అన్నతమ్ముళ్లం నాలుగు బంకులు వేసుకొని ఉన్నాము. వైసీపీ ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో మాలో ఇద్దరికి మాత్రమే చేయూత పథకం లబ్ధి అందుతోంది. ఆనాడు చంద్రన్న ఇచ్చిన పనిముట్లతోనే ఇప్పటికీ మాకుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి.

- మణికుమార్, నాయీబ్రాహ్మణుడు, శింగనమల

పెంచిన పింఛన్ ఇవ్వడానికి ఐదేళ్లా..?



కదిరిఅర్బన్: గతంలో చంద్రబాబు ఇచ్చే రూ.రెండువేల పింఛన్‌ను జగన్ రూ.మూడువేలు చేస్తానని హామీ ఇచ్చారు. పెంచిన పింఛన్ ఇవ్వడానికి ఐదేళ్లు పట్టింది. ఏడాదికొక్కసారి రూ.250లు పెంచుతానని ఎన్నికలకు ముందు చెప్పలేదు. ఇపుడు ఇచ్చే రూ.మూడు వేలకు రూ. ఐదవందలు పెంచి ఇస్తానంటున్నారు. ఇది కూడా మూడేళ్ల తరువాత ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతానని హామీ ఇస్తున్నారు. ఇది ప్రజలు నమ్మే స్థితిలో లేరు. చంద్రబాబు రూ.నాలుగువేలు ఇస్తానంటున్నారు. రూ.నాలుగువేలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇస్తామంటున్నారు. ఇది పింఛన్‌దారులకు ఎంతో ఉపయోగం.

- పాపులమ్మ, ఎగువపల్లి, కదిరి మండలం

ఫ్యాన్ గాలికి... జగన్ హామీ



హరీష్‌రెడ్డి, పాపంపేట,
అనంతపురం రూరల్ మండలం

అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర యువతకు హామీ ఇచ్చారు. అయితే ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండ్ విడుదల చేయలేదు. పైగా ఉన్నత విద్యను కూడా యువతకు దూరం చేశాడు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆ హామీ ఫ్యాన్ గాలిలో కొట్టుకుపోయింది. ఐదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమకూడా రాలేదు. స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం లేదు. టీడీపీ పాలనలోనే ఉమ్మడి జిల్లాకు కియ పరిశ్రమ తెచ్చి ఎంతో మందికి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. అది కూడా లేకపోతే..ఇతరప్రాంతాలకు వెళ్లిపోయే పరిస్థితి. సంక్షేమంతోపాటు..అభివృద్ధి చేసేవారిని గెలిపించుకోవాలి.

- అనంతపురం రూరల్

ఇళ్ల వద్దకే పింఛన్



అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, ఏప్రిల్ 28 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారులకు ఎట్టకేలకు ఇంటివద్దే పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి పింఛన్ పంపిణీ మార్గదర్శకాలను విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛన్‌దారులకు మే, జూన్ నెలలకు సంబంధించి బ్యాంకు ఖాతాలకు లేదా ఇంటివద్దకే సొమ్ము అందజేయనున్నట్లు వెల్లడించారు. పింఛన్‌దారులు సచివాలయాలు, ఇతర కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మే, జూన్ నెలలకు సంబంధించి పింఛన్ లబ్ధిదారుల ఆధార్ అనుసంధానమైన ఎన్‌పీసీఐ ద్వారా నిర్ధారించిన బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని పింఛన్‌దారులకు, ప్రత్యేక కేటగిరి విభిన్నప్రతిభావంతులు, మంచానికే పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు, నడవలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈనెల 30న ఆయా మండలాల గ్రామ సచివాలయాలు, మున్సిపాలిటీల వార్డు సచివాలయాలల్లో పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమచేసిన వివరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. బ్యాంకు ఖాతాల్లో జమకాని వారికి 3వతేదీన ఇంటివద్దే పింఛన్ పంపిణీ చేస్తామని తెలిపారు.

శ్రమజీవుల నేల

●రైతులు.. కూలీలు అధికం
రెండు జిల్లాల పరిధిలో రాప్తాడు
● హంద్రీనీవా వచ్చేదాకా బీడు

రాప్తాడు, ఏప్రిల్ 28: పునర్విభజనలో భాగంగా 2009లో రాప్తాడు నియోజకవర్గం ఏర్పడింది. అంతకు ముందు రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాలు అనంతపురం నియోజకవర్గంలో ఉండేవి. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలు పెనుకొండ నియోజకవర్గంలో ఉండేవి. 2009లో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలను రాప్తాడు నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటికి మూడు సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. 2009, 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పరిటాల సునీత, 2019లో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజయం సాధించారు. నియోజకవర్గం 2022 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. మొత్తం జనాభా 3,46,090 మంది ఉన్నారు. 2009లో పరిటాల సునీతకు అత్యల్ప మెజార్టీ 1750 ఓట్లు, 2019లో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 25,575 ఓట్ల అత్యధిక మెజార్టీ వచ్చింది.

● రాప్తాడు నియోజకవర్గం జిల్లా కేంద్రమైన అనంతపురం నుంచి కర్ణాటక సరిహద్దు వరకూ విస్తరించి ఉంది. రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలు జిల్లా కేంద్రమైన అనంతపురానికి కూత వేటు దూరంలో ఉన్నాయి. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం కర్ణాటక ప్రాంతానికి సరిహద్దుగా ఉంది. అనంతపురం నుంచి చెన్నేకొత్తపల్లి వరకూ దాదాపు 50 కి.మీ 44వ జాతీయరహదారి విస్తరించి ఉంది.

● రామగిరి మండలం పేరూరులో పెన్నానదిపై 1950లో నీలం సంజీవ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 1.80 కోట్లతో 2 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు. పెన్నానది నీరు, వర్షపు నీటితో ఈ ప్రాజెక్టుకు నీరు రావాలి. పెన్నానదిలో కర్ణాటకలో అక్రమ ప్రాజెక్టులు, చెక్ డ్యాంలు నిర్మించడం వలన ఈ ప్రాజెక్టుకు నీరు రావడం కష్టంగా మారింది. ఈ ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉంటే 11 వేల ఎకరాల ఆయకట్టు భూమి సాగులోకి వస్తుంది. రామగిరి, కంబదూరు, కనగానపల్లి, రాప్తాడు మండలాల్లో బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయి. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాదయాత్ర సమయంలో రామగిరి మండలంలో పర్యటించినప్పుడు పేరూరు ప్రాజెక్టు గురించి వివరించి నీరు తీసుకురావాలని పరిటాల సునీత విన్నవించారు. 2014 నుంచి 2019 వరకూ ఆమె మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబుతో మాట్లాడి జీడిపల్లి జలాశయం నుంచి కృష్ణా జలాలు పేరూరు డ్యాంకు వచ్చేలా 62 కి.మీ కాలువ తవ్వేందుకు దాదాపు రూ.803 కోట్లు నిధులు మంజూరు చేయించారు. కాలువ పనులు చేపడుతున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిపి వేశారు.

● రాప్తాడు నియోజకవర్గంలో ఎక్కువగా వ్యవసాయం, పాడి, గొర్రెల పెంపకంపై ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. చెరువులకు నీరు సరఫరా చేయకపోవడంతో రైతులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహంగా ఉన్నారు. ముఖ్యంగా 10 ఎకరాల సాగు భూమి ఉన్న వారికి పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించారు. వారంతా ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యారు. రాప్తాడులో నియోజకవర్గంలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా కురుబ, బోయ కులస్థుల ఓటర్లు ఎక్కువగా ఉన్నాయి. బీసీ ఓటర్లు ఏ పార్టీకి మద్దతు తెలిపితే వారే విజయం సాధిస్తారు

● రాష్ట్రంలో రాప్తాడు అంటే పరిటాల అనే ముద్ర పడింది. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన వ్యక్తి పరిటాల రవీంద్ర. ఆయన మరణాంతరం పరిటాల సునీత రాజకీయ ప్రవేశం చేశారు. 2009లో రాప్తాడు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలో లేకపోయినా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది 2019 వరకూ ఐదేళ్లు మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి నుంచి ఆమిదాలకుంట వరకూ అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్రే కీలకం

అంకితభావం, నిబద్ధతతో పనిచేయండి

కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్



మాట్లాడుతున్న ఎన్నికల జనరల్ పరిశీలకుడు మనీష్‌సింగ్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలోని ఆడిటోరియంలో ఆదివారం రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అబ్జర్వర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా నియోజకవర్గాల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. తదితర వివరాలను పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మనీష్‌సింగ్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్ సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. నివేదికలను త్వరగా అందజేయాలని తెలిపారు. మాక్ పోల్‌ను పర్యవేక్షించాలన్నారు. మరో పరిశీలకుడు అజయ్‌నాథ్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ చాలా ముఖ్యమన్నారు. పోలింగ్ స్టేషన్లలో తమ పాత్ర ఏమిటో స్పష్టంగా తెలుసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్ రోజు సాధారణ పరిశీలకులు అన్నిచోట్లా ఉండలేరు కాబట్టి మైక్రో అబ్జర్వర్లను ఎన్నికల కమిషన్ నియమించిందన్నారు. జిల్లాలో 1031 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అక్కడ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే సెక్టోరియల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రాజా రవివర్మ (జయంతి)



భారతీయ చిత్రకళ చరిత్రలో గొప్ప చిత్రకారుడిగా గుర్తింపు పొందిన రాజా రవివర్మ 1848 ఏప్రిల్ 29న కేరళ రాష్ట్రం కిలమానూర్‌లో జన్మించారు. తైలవర్ణ చిత్రకళను బ్రిటీష్ దేశస్థుడైన థియోడార్ జెన్సన్ వద్ద నేర్చుకున్నారు. రామాయణ, మహాభారతంలోని ఘట్టాలను చిత్రాలుగా మలచి గుర్తింపు పొందారు. భారతీయ సాంప్రదాయిక, పాశ్చాత్య చిత్రకళ మెళకువల సంగమానికి ఆయన చిత్రాలు చక్కని మచ్చుతునకలు. చీరకట్టుకున్న స్త్రీలను అందంగా, చక్కని వంపు సొంపులతో చిత్రించడంలో ఆయనకు ఆయనే సాటి. 1873లో వియన్నా కళాప్రదర్శనలో మొదటి బహుమతి దక్కించుకుని ప్రపంచవ్యాప్తంగా పేరొందారు. 1906 అక్టోబరు 2న కన్నుమూశారు.

ఖురేషి అల్లారఖా ఖాన్ (జయంతి)



ఖురేషి అల్లా రఖాఖాన్ 1919 ఏప్రిల్ 29న కాశ్మీర్‌లోని ఫగ్వాల్‌లో జన్మించారు. భారతీయ తబలా కళాకారుడు. సితార్ విద్వాంసుడు రవిశంకర్‌కు ఎక్కువసార్లు వాద్య సహకారం అందించారు. ఈయన కొడుకు జాకీర్ హుసేన్ కూడా ప్రముఖ తబలా విద్వాంసుడే. ఈయన మాతృభాష డోగ్రీ. ముంబైలో ఆలిండియా రేడియోలో స్టాఫర్‌గా పనిచేశారు. 1943-48లమధ్య రెండు మూడు హిందీ సినిమాలకు సంగీతం అందించారు. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతానికి మధ్య అంతరం పూరించారు. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు ఇతర అవార్డులు అందుకున్నారు. 2000 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

జుబిన్ మెహతా (పుట్టినరోజు)



'పద్మ విభూషణ్' గ్రహీత జుబిన్ మెహతా 1936 ఏప్రిల్ 29న బాంబేలో పార్సీ కుటుంబంలో జన్మించారు. ఇజ్రాయెల్ ఫిలాహార్మోనిక్ ఆర్కెస్ట్రా (ఐపీఓ) కు సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. లాస్ ఏంజెల్స్ ఫిల్‌హార్మోనిక్‌ను పర్యవేక్షించారు. రాయల్ లివర్‌పూర్ ఫిల్‌హార్మోనిక్‌ను నిర్వహించి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. న్యూయార్క్ ఫిల్‌హార్మోనిక్‌కు సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. ఠాగూర్ అవార్డు, ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా ఇతర గౌరవాలు అందుకున్నారు.

ఆంద్రీ అగస్సీ (పుట్టినరోజు)



ఆంద్రీ కిర్క్ అగస్సీ 1970 ఏప్రిల్ 29న జన్మించారు. అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడాకారుడు. సింగిల్స్‌లో వరల్డ్ నెంబరు వన్‌గా పేరొందారు. 8సార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించారు. 1996 ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్. నాలుగు రకాల గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్స్‌లో సత్తా చాటిన తొలి క్రీడాకారుడు. 2006లో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పి చారిటీ ఫౌండేషన్ ద్వారా సమాజ సేవలో కొనసాగుతున్నారు.



కనుమరుగైన పెద్దనోట్లు.. రూ.500దే హవా

హిందూపురం, ఏప్రిల్ 28: కొన్నేళ్ల కిందట ఎన్నికలంటే హామీలు, వాగ్దానాలు మాత్రమే ఉండేవి. మారిన పరిస్థితుల్లో ఎన్నికలను డబ్బు, మద్యం ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు వచ్చాయంటే కొన్ని ప్రాంతాల్లో మద్యం ఏరులైపారుతుంది. డబ్బు పంపిణీ కూడా విచ్చలవిడిగా జరుగుతోంది. పెద్దనోట్ల రద్దుతో ప్రస్తుత ఎన్నికల్లో రూ.500 నోట్ల హవా నడవనుంది. వద్దు వద్దంటూనే ఓటుకు నోటు తీసుకోవడం కొందరు ఓటర్లకు అలవాటుగా మారింది. అభ్యర్థిలో మంచి గుణాలకన్నా, శ్రీమంతుడైతే ఓట్లు కొంటాడని, ఎక్కువ మొత్తం ఇస్తాడని ఆశిస్తుంటారు. 2014లో ఎన్నికలు జరిగిన సమయంలో రూ.వెయ్యి నోటు అందుబాటులో ఉంది. దీంతో ఆ నోట్ల కట్టలు తరలించేందుకు, పంచేందుకు కొందరు అభ్యర్థులు పెద్దగా ఇబ్బంది పడలేదు. ఆ తర్వాత రెండేళ్లకే ఆనోటును రద్దు చేశారు. అయితే 2019 ఎన్నికల సమయంలో రెండు వేల రూపాయల నోటు అందుబాటులో ఉండటం అభ్యర్థులకు బాగా కలిసివచ్చింది. అభ్యర్థుల అనుచరులు సులభంగా డబ్బును తరలించడంతో పాటు పంపిణీ కూడా చేసేశారు. గత ఏడాది ఈ నోటును కూడా ఆర్బీఐ రద్దు చేసింది.

నాయకుల నిట్టూర్పు

ఇలా వెయ్యి, రూ.2వేల నోట్లు కనుమరుగు కావడంతో ఇచ్చిపుచ్చుకోవడానికి సులభంగా ఉండే పెద్ద నోట్లు పోయాయని నాయకులు నిట్టూరుస్తున్నారు. ఎన్నికల సమయంలో పంచేందుకు అభ్యర్థికి, తీసుకునేందుకు ఓటరుకు సులభంగా ఉండే పెద్దనోట్లు రద్దు కావడం కొంతమేర ఇబ్బందిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం చలామణిలో ఉన్న పెద్ద నోటు రూ.500దే ఎన్నికల్లో హవా నడుస్తోంది. ఈ ఎన్నికల్లో నాయకుల వద్ద ఎటుచూసినా ఈ నోటే కనిపిస్తోంది.

రూ. 50 లక్షల స్వాధీనం

గుంతకల్లు, ఏప్రిల్ 28: రైళ్లల్లో మద్యం, గంజాయి తదితర మాదక ద్రవ్యాల రవాణా, డబ్బు తరలింపులపై నిఘా పెట్టిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనధికారికంగా ఉంచిన రూ. 50 లక్షల నగదు లభ్యమైంది. ఆదివారం రైళ్లల్లో, ప్లాట్‌ఫారాలపై ఉన్న ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తుండగా పెద్ద మొత్తంలో నగదు దొరికింది. పట్టణంలోని కసాపురం రోడ్డులోని సాయి హనుమాన్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న అర్చన కార్వా అనే మహిళ 1వ నెం. ప్లాట్‌ఫారం ఎంట్రెన్సులో ఉండగా, ఆమె లగేజీ బ్యాగును అధికారులు తనిఖీ చేశారు. అందులో రూ. 50 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు కనుగొన్నారు. ఈ నగదుకు సంబంధించి తగిన ఆధారాలు లేకపోవడంతో డబ్బును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్ సుబ్బలక్ష్మి, జీఆర్పీ ఎస్ఐ ఎం రామదాసు సీజ్ చేశారు.

ఉత్సాహంగా వరల్డ్ 10కే రన్

దివ్యాంగుల సహా 28 వేలమంది భాగస్వామ్యం



రన్‌లో ఉత్సాహంగా యువత పరుగులు



దివ్యాంగులు సైతం ఉత్సాహంగా



విజేతలతో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్



ఓవరాల్ మహిళల విభాగం విజేతలు

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ 10కే రన్ నగరంలో ఉత్సాహంగా సాగింది. ఫీల్డ్ మార్షల్ మాణిక్ షా పరేడ్ మైదానం వేదికగా 16వ ఎడిషన్ టీసీఎస్ వరల్డ్10కే ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకే ప్రారంభమైంది. అన్ని విభాగాలకు సంబంధించి 28వేలమందికిపైగా ఔత్సాహికులు భాగస్వామ్యులయ్యారు. ఓపెన్ 10కే రన్‌లో 18,433మంది పాల్గొనగా జనరల్ రాజేంద్రదివాన్, మేజర్ జనరల్ రవిమురుగన్, లెఫ్టినెంట్ జనరల్ ప్రదీప్ సీ నాయర్, అడిషినల్ డీజీపీ ఎస్ రవి, ఐజీ సందీప్‌పాటిల్‌లు రేస్‌ను ప్రారంభించారు. 96ఏళ్ల దత్తాత్రేయ రేస్‌ను పూర్తి చేయడం రికార్డుగా నిలిచింది. మజారన్‌లో 9,932మంది భాగస్వామ్యులు కాగా సిల్వర్స్ రన్ ఫర్ సీనియర్ సిటిజన్స్ విభాగంలో 1810మంది, చాంపియన్స్‌లో విభాగంలో 513మంది పాల్గొన్నారు. విజేతలకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, హోం మంత్రి పరమేశ్వర్, అడిషినల్ సీఎస్ మంజునాథ్ ప్రసాద్, ఇండియన్ అథ్లెటిక్స్ అంజుబాబిజార్జ్, అశ్వినినాచప్పలు బహుమతి ప్రదానం చేశారు. విధానసౌధ, హలసూరు లేక్‌ల మీదుగా రన్ సాగింది. తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైన రన్ ఉదయం 10 గంటలకు ముగిసింది. రన్ సాగిన ప్రాంతాల్లో తాత్కాలికంగా ట్రాఫిక్‌ను మళ్లించారు. వివిధ విభాగాల విజేతలను స్వయంగా గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అభినందించారు. ఈసారి కూడా కెన్యా దేశస్థులు పలు విభాగాల్లో సత్తా చాటుకున్నారు. ఈసారి కూడా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. మారథాన్‌లో పాల్గొన్నవారికి తగిన సదుపాయాలు కల్పించారు. ట్రాఫిక్ సజావుగా సాగేలా పలు చర్యలు చేపట్టారు. కొన్ని నిర్దేశిత ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు వీలు చేశారు.

ప్రసన్న నంజుండేశ్వరస్వామి రథోత్సవం



కాడుగూడిలో రథోత్సవం ఇలా...

మహదేవపుర, ఏప్రిల్ 28: మహదేవపుర నియోజకవర్గంలోని కాడుగూడిలో కొలువైన ప్రసన్న నంజుండేశ్వరస్వామి బ్రహ్మ రథో త్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉద యం స్వామివారిక విశేషపూజలు అలం కరణలు నిర్వహించారు. మాజీ మంత్రి అర వింద లింబావళి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆత్మీయంగా స్వాగతించి సత్కరించారు. రథోత్సవంలో హగదూరు, వైట్‌ఫీల్డ్, చన్నసంద్ర, వర్తూరు, గుంజూరు, హరాడి, నల్లూరహళ్ళి, నాగొండహళ్ళి, కాడుగూడి తదితర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. వీరగాసె, డొళ్ళుకుణిత, తమటె, పూజా కుణిత, నాదస్వరం, మైసూరు నగారి, నందిధ్వజ కుణిత, కీలు గుర్రాలు, గారడీబొమ్మలు తదితర కళాబృందాలు పాల్గొని సందడి చేశాయి. రథంపై అరటి పండు, దవనం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వేలాదిమందిగా పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవంలో కోలారు ఎంపీ ఎస్ మునిస్వామి, బీజేపీ ప్రముఖులు అశ్వత్థనారాయణ, హగదూరు శ్రీనివాస్, అరవిందబాబు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



రథంపైకి అరటిపండు వేస్తున్న మాజీ మంత్రి లింబావళి



యల్లంపల్లి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెంకటరమణస్వామి...

బాగేపల్లి, ఏప్రిల్ 28: తాలూకాలోని యల్లంపల్లి గ్రామంలో కొలువైన శ్రీ వెంకట రమణ స్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక ప్రముఖులు వరలక్ష్మి కుటుంబీకులు వీకే బాబు, రాధ రథోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత స్వామివారికి అర్చ కులు పంచామృతాభిషేకం, వజ్రకవచధారణతో అలంకరణ నిర్వహించారు. రథాన్నిపుష్పాలతో అలంకరించారు. హోమాదికాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. తాలూకా వ్యాప్తంగా ప్రజలు రథోత్సవానికి తరలివచ్చారు. రాత్రి ముత్యాలపల్లకీలో స్వామివారిని ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానక ప్రసాదం పంపిణీ చేశారు. ఉత్సవాల్లో వరలక్ష్మి, చన్నరాయప్ప, పిల్లలు మునిస్వామి, భైరప్ప, రామప్ప, సీ వెంకటరెడ్డి, అశ్వత్థరెడ్డి కుటుంబీకులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా సంకష్ట చతుర్థి పూజలు



ద్విముఖ గణపతికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, ఏప్రిల్ 28: పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన ద్విముఖ గణపతి దేవాలయంలో సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, ఆలయశుద్ధి అనంతరం స్వామివారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాయంత్రం స్వామివారికి వెన్న అలంకరణ, పుష్పాలంకరణ అనంతరం ధూపదీప నైవేద్యాలు, మహామంగళారతి నిర్వహించారు. పురోహితుడు కృష్ణమూర్తి నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. మహిళలు, పాఠశాల విద్యార్థులు పెద్దసంఖ్యలో విశేషపూజల్లో పాల్గొన్నారు.

రూ.1.06 కోట్ల నగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు ఇవే...

బంగారపేట, ఏప్రిల్ 28: కేజీఎఫ్ పట్టణానికి చెందిన బంగారం వ్యాపారి పోగొట్టుకున్న నగల కేసును బంగారపేట పోలీసులు ఛేదించారు. ఇన్‌స్పెక్టర్ ఎం నంజప్ప నేతృత్వంలో ఐదుమంది నిందితులను అరెస్టు చేసి రూ.1.06 కోట్ల విలువైన 1.400 కిలోల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేజీఎఫ్ నివాసి యూ గౌతమ్‌చంద్ ఫిబ్రవరి 25న బంగారపేట పట్టణంలోని జ్యువెల్స్‌కు సరఫరా చేసేందుకు వచ్చాడు. బస్టాండ్‌లో ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి గౌతమ్‌చంద్‌ను ఏమార్చి నగలబ్యాగుతో పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్నారు. ఎస్పీ కేఎం శాంతరాజు, డీఎస్పీ పాండురంగల మార్గదర్శకంలో బంగారపేట క్రైం పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేడీపేట నివాసి ఎం ఘంట శ్రీకాంత్, చిన్నయ్యపాళ్య గ్రామానికి చెందిన మేకల హరికిరణ్ పాండు, మేకల లావ, ఒడిశ్శా రాష్ట్రం గంజం జిల్లా నారాయణపురకు చెందిన జీ అరేశ్‌రాస్, జీ లక్ష్మీదాస్‌లను అరెస్టు చేశారు. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ కాంతరాజు అభినందించారు. కాగా నేరాల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతైనా ఉందన్నారు.

అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిని ప్రారంభిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సంగీత మాంత్రికుడు శ్యామశాస్త్రికి నివాళులు అర్పించేలా బెంగళూరు జయనగర్‌లోని యువజనసంఘంలో నటనం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్ ఆచార్య డాక్టర్ రక్షా కార్తీక్, శిష్య బృందంచే సమర్పించిన సంగీత విభావరి అలరించింది. ఐఐటీడీఎం కంచీపురం పాలకవర్గం అధ్యక్షులు, ఐఐటీ బెంగళూరు సంస్థాపక డైరెక్టర్ సదగోపన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా విద్వాన్ ఆనూరు అనంతకృష్ణశర్మ, సంగీత కళారత్న డాక్టర్ ఎం సూర్యప్రసాద్, కర్ణాటక కళాశ్రీ గ్రహీత, ప్రముఖ భరతనాట్య ప్రతిపాదకులు, సంస్కృతి డైరెక్టర్ సూర్యనారాయణ రాజు, డాక్టర్ మురళీధర్ పాల్గొన్నారు. విభావరిలో నట్టువాంగంపై విద్వాన్ దేవరాజు బీవీ, గాయనానికి విద్వాన్ బాలసుబ్రమణ్యశర్మ, వీణపై విద్వాన్ ప్రశాంత్, వేణువుపై విద్వాన్ జయరామ కిక్కేరి, రిథమ్‌ప్యాడ్‌పై విద్వాన్ ప్రసన్నకుమార్ సహకారం అందించారు. కర్ణాటక సంగీత విద్వాంసుడు శ్యామశాస్త్రికి నివాళులు అర్పించేలా చక్కటి కార్యక్రమం నిర్వహించడంపై సంగీతా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

కనిశెట్టిహళ్ళిలో గొడవ - పరస్పరం ఫిర్యాదు



గోవర్ధన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జేకే కృష్ణారెడ్డి

చింతామణి, ఏప్రిల్ 28: తాలూకాలోని కనిశెట్టిహళ్ళి గ్రామంలో శుక్రవారం వాలీబాల్ ఆటలాడుతున్న వేళ రెండు వర్గాల మధ్య చోటు చేసుకున్న గొడవ ఇద్దరు గాయపడడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గొడవకు సంబంధించి కెంచార్లహళ్ళి పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. వాలీబాల్ ఆడుతుండగా బంతి బయట వస్తుంది. ఒకబృందం ఔట్ అయ్యిందని మరో బృందం కాదంటూ గొడవపడ్డారు. గాయపడిన 22ఏళ్ల గోవర్ధన్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో తాను ఇంటికి వెళ్లాక గ్రామానికి చెందిన నరేంద్ర, గణేశ, శీన, బాబు, బాలాజి, అనిల్, కల్యాణ్, నరసింహమూర్తిలు రాళ్ళు, కర్రలతో తనపై దాడి చేశారన్నారు. నరేంద్ర చాకుతో దాడికి యత్నించాడన్నారు. రెండు చేతులకు గాయాలయ్యాయి. కిందపడేసి తలను గాయపరిచారు. కేకలు వేయడంతో గ్రామస్తులు చేరుకోవడంతో యువకుల బృందం పారిపోయింది. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా 56ఏళ్ల నరసింహప్ప, గోవర్ధన్ బృందంపై ప్రత్యర్థి బృందం ఫిర్యాదు చేసింది. కనిశెట్టిహళ్ళి మటన జేడీఎస్, కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేశారు. జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే జేకే కృష్ణారెడ్డి బాధితులను పరామర్శించారు. గొడవలను రాజకీయం చేయరాదని అభిప్రాయపడ్డారు. చిన్న విషయాలను పెద్దవి చేసి రాజకీయ లబ్ధికి వినియోగించరాదన్నారు.

హలో..! ఏనప్ప నిమ్మూరల్లి యారు గెలితారే..?

రాయదుర్గం, ఏప్రిల్ 28: హలో..! ఏనప్పా నిమ్మూరల్లి యారు గెలితారే..?(ఏమప్పా మీ ఊరిలో ఎవరు గెలుస్తారు) అంటూ రాయదుర్గం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్‌లో ఆరాలు తీయడం ఎక్కువైంది. కర్ణాటకకు సరిహద్దులో ఉండటంతో ఈ నియోజకవర్గంలోని అధికశాతం ప్రజలు కన్నడ ఎక్కువగా మాట్లాడతారు. ఇక్కడి ప్రజలకు బెంగళూరు, బళ్లారి, చిత్రదుర్గం, చెళ్లకెర ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బంధుత్వాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ జరుగుతుండటంతో రోజూ సెల్‌ఫోన్‌లలో కన్నడ భాషలో అక్కడి ప్రాంత బంధువులు, మిత్రులు వ్యాపారులు మీ ఊరిలో జరుగుతున్న ఎన్నికల్లో ఎవరు గెలుస్తారని అడుగుతున్నారు. హోటళ్లు, కూడళ్ల వద్ద సరిహద్దు గ్రామాల్లో, సెల్‌ఫోన్‌లలో ఇదే చర్చ ప్రస్తుతం జరుగుతోంది. అంతే కాకుండా రాయదుర్గం నుంచి బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు కర్ణాటక బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఆ బస్సుల్లో కూడా ప్రయాణికుల మధ్య కన్నడ భాషలో రాజకీయ చర్చలే జరుగుతున్నాయి.



ఫినిష్ ఆంధ్ర..!


- ఉత్తుత్తి మాటలుగా సీఎం జగన్ హామీ
- హార్బర్ తరహాలో వ్యాపారాలంటూ మోసం

అనంతపురం ప్రెస్‌క్లబ్ 'మత్స్యకారుల అభివృద్ధే తమ ధ్యేయం... వారికి మత్స్య సంపదను అందిస్తాం... అందులో భాగంగా జిల్లాకో ఆక్వా హబ్ ఏర్పాటు చేస్తాం' అని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి 2020 నవంబరు 21న మత్స్యకార దినోత్సవం సందర్భంగా హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మిన మత్స్యకారులు సంబరపడిపోయారు. తీరా చూస్తే అవి ఒట్టిమాటలేనని తేలడంతో ఆ వర్గాలకు నిట్టూర్పు తప్పలేదు. రూ. కోటితో ఆక్వా హబ్‌ను ఎలా నిర్మించాలనుకున్నారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సముద్రతీర ప్రాంతాల సమీపంలో ఉండే ఆక్వా హబ్‌లు ఏర్పాటు చేయాలంటే దాదాపు రూ. 4 కోట్ల వరకూ ఖర్చవుతున్నట్లు సమాచారం. ఆక్వా హబ్ ఏర్పాటుకు అంచనాలు, ఖర్చు ఇవన్నీ తెలిసి ప్రభుత్వం ప్రకటించిందా...? లేదా గొప్పలు పోవడానికి ఆక్వా హబ్‌ను ప్రకటించిందా.. అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

● జిల్లాలో ఆక్వా హబ్ ఏర్పాటు కావాలంటే దానికి అనుసంధానంగా 178 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు ఉండాలి. ఆ తరహాలో యూనిట్లు ఏర్పాటైతేనే హబ్ నడిపే వెసులుబాటు ఉంటుంది. అప్పుడే హబ్‌లో పలు రకాల సముద్రజాతుల చేపలను నిల్వ చేసుకొని యూనిట్లకు సరఫరా చేయవచ్చు. ఇవన్నీ అసాధ్యమని తెలిసినప్పటికీ గొప్పలు పోయారు. జిల్లాలో హబ్ ఏర్పాటుకు రూ. కోటితో అంచనా వేసిన ప్రభుత్వం చేతులు దులుపుకుంది. హబ్ ఏర్పాటు కావాలంటే సుమారు ఆరేడు కోట్లు అవుతున్నట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. నాలుగేళ్లుగా ఎంతోమంది పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినా.. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో ఏర్పాటు చేయలేమని వెనక్కు వెళ్లిపోయారు. హబ్ ఏర్పాటుకు ఓ ప్రముఖ సంస్థ ముందుకొచ్చినప్పటికీ.. 178 యూనిట్లలో కనీసం 50 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లనైనా ఏర్పాటు చేయాలని మెలికపెట్టారు. నాలుగేళ్లుగా అధికారులు ఎంత ప్రయత్నించినప్పటికి 50 ఫిష్ ఆంధ్రా షాపులను ప్రారంభించగలిగారు. అవికూడా మత్స్య సహకార సంఘాల్లో ఉన్న వారితోనే తెరిపించినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఆ షాపులకు హబ్ ప్రమోటర్లు అందించే చేపలు అధిక ధరలు ఉండటంతో... విక్రయించలేక దాదాపు 30కిపైగా దుకాణాలను మూసేశారు. మరికొందరు అవే షాపుల్లో చికెన్‌సెంటర్లు, మటన్ సెంటర్లు నిర్వహించుకుంటున్నారు.

● 'రోడ్డు పక్కన వ్యాపారం వద్దు.. నాణ్యమైన చేపల మాంసాన్ని అమ్ముదాం. వినియోగదారులను మనవైపు తిప్పుకుందాం.. లాభాలు గడిద్దాం' అని మత్స్యశాఖ అధికారులు జిల్లాలోని పలువురు మత్స్యకారులు, ఔత్సాహికులతో బలవంతంగా షాపులను తెరిపించారు. రూ. 30 వేలు పెట్టుబడి పెట్టండి... షాపు చూపించండి... అంతా మేము ఏర్పాటు చేస్తాం... బయటి మార్కెట్లో కన్నా.. కిలో చేపలపై రూ. 10 తగ్గింపుతో ఇస్తాం.. అని చెప్పి నగరంలో ఫిష్ ఆంధ్రా పేరుతో చేపల యూనిట్లను ఏర్పాటు చేశారు. లాభాలొస్తాయని కొందరు మత్స్యకారులు, ఔత్సాహికులు ఆశపడి రూ. 30వేలు చెల్లించి మరీ షాపులను తెరిచారు. పట్టుమని నెలరోజులు కూడా వారు చెప్పిన మాట మేరకు చేపలను ఇవ్వలేకపోయారు. తక్కువ ధరలు ఆటుంచితే.. కనీసం తాము కోరిన రకం చేపలైనా ఇవ్వండయ్యా వ్యాపారాలు చేసుకుంటామన్నా అధికారులు పట్టించుకోలేదు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.29	1,576.05
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	260	253
సామర్థ్యం (టీఎంసీలు)	3.70	2.84

కాంగ్రెస్ ఉగ్రవాదుల స్థావరం

▸▸ హొసపేటె సభలో విరుచుకుపడిన మోదీ



హొసపేటె సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

బళ్లారి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఉగ్రవాదులను ప్రోత్సహిస్తుందని, ఓటుబ్యాంకు రాజకీయం కోసం దేశ ద్రోహులను పెంచుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బెంగళూరులో రామేశ్వరికేఫ్ వద్ద బాంబుపేల్చిన ఉగ్రవాదులను కాంగ్రెస్ ఏమిచేసిందో అందరికీ తెలిసిందేనన్నారు. బెళగావిలో ఒక ఆడపిల్లపై లైగింక దాడి చేస్తే కాంగ్రెస్ నేరగాళ్లను శిక్షించిందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉండే రాష్ట్రాల్లో శాంతభద్రతలు పూర్తిగా లోపించాయని, కర్ణాటకలో ఉగ్రవాదులు తలదాచుకుంటున్నా ఇక్కడ అధికారంలో ఉండే కాంగ్రెస్ పార్టీ ఏమిచేసిందని మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయం ఆడుతూ దేశద్రోహులకు స్థావరం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బళ్లారి లోక్‌సభ పరిధిలోని విజయనగర(హొస్పేట్)లోని మున్సిపాల్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించారు.

2014 ముందు ఉగ్రవాదులు దేశంలో ఎలా ఉండేవారు? కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చాక దేశంలో ఉగ్రవాదం ఎలా ఉందో ప్రజలు గుర్తు చేసుకోవాలని కోరారు. కర్ణాటకలో బీజేపీ పరిపాలనలో అనేక రైళ్ల మార్గాలు వేసి అభివృద్ధి చేశామన్నారు. 500 సంవత్సరాల క్రితం ఉండే రామమందిరాన్ని పునర్నిర్మించి దేశ ప్రజలకు హిందుత్వం అంటే ఏమిటో తెలియజెప్పామన్నారు. రైతులకు కర్ణాటక ప్రభుత్వం ఇవ్వాల్సిన పంటనష్టం కూడా సరిగా ఇవ్వలేదన్నారు. కల్యాణ కర్ణాటకను అన్నిరకాలుగా అభివృద్ధి చేసేందుకు బీజేపీ కంకణం కట్టుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ఉన్నదంటున్నారన్నారు. వారు దేశానికి ఏమిచేశారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. దేశ ద్రోహి పార్టీ అయిన కాంగ్రెస్‌ను ఓడించాలని కోరారు. వందే మాతరం అని నినాదాలు చేస్తూ ప్రజలతో చేయించారు. చిన్నచిన్న ప్రాంతీయ పార్టీలతో చేరి కాంగ్రెస్ దేశానికి ఏమి చేస్తారో చెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలని అలాగే అందరితో వేయించాలని కోరారు. ఈ సభలో మోదీతో పాటు బళ్లారి ఎంపీ అభ్యర్థి బి. శ్రీరాములు, కొప్పళ ఎంపీ బసవరాజ్, రాయచూరు అభ్యర్థి రాజా అమరేశ్వరనాయక్, హావేరి అభ్యర్థి బసవరాజ్ బొమ్మై, బెళగావి అభ్యర్థి జగదీష్ శెట్టర్‌లతోపాటు మాజీ మంత్రి ఆనంద్‌సింగ్, జేడీఎస్ నాయకుడు కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, గాలి లక్ష్మీఅరుణ, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో అపశృతి

- భోజనం చేసిన 92 మందికి అస్వస్థత
- దావణగెర ఆసుపత్రికి బాధితుల తరలింపు



దావణగెర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 28: హరపనహళ్ళి తాలూకా సింగ్రిహళ్ళి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన వివాహ కార్యక్రమంలో భోజనం చేసిన 92మంది అస్వస్థతకు గురయ్యారు. భోజనం చేసిన కొద్దిసేపటికే తిన్నవారందరికీ వాంతులు, విరేచనాలు కావడంతో శుభకార్యం కాస్తా అస్తవ్యస్తంగా మారింది. అతిసారకు గురైనవారందరినీ దావణగెర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సింగ్రిహళ్ళి గ్రామంలో శనివారం వధువు ఇంటిలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో లడ్డు, పాయసం, పల్యం, అన్న సాంబారు వడ్డించారు. భోజనం తిన్న తరువాత అందరికీ కడుపునొప్పితో వాంతులు విరేచనాలు ప్రారంభం కావడంతో తక్షణం గ్రామంలోని ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, బైక్‌ల్లో బాధితులను దావణగెర చిటగేరి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విజయనగర జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.ఎల్.ఆర్.శంకర్ నాయక్ ఆదివారం ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం



విద్యార్థులను సత్కరిస్తున్న బీకేజీ గ్లోబల్ సంస్థ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 28: మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బీకేజీ గ్రూప్ ద్వారా బహుమతులు అందజేస్తామని బీకేజీ గ్రూప్ అధ్యక్షుడు బి.రుద్రగౌడ తెలిపారు. సండూరు పట్టణం బీకేజీ గ్లోబల్ పాఠశాలలో ఆదివారం పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైపుణ్యం ఉన్న విద్యార్థులను ఆదుకునేందుకు సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా అర్హులైన విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తామని చెప్పారు. 2023-24 సంవత్సరం ద్వితీయ పీయూ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బీకే జీ పౌండేషన్ ద్వారా ప్రథమ స్థానం పొందిన వారికి రూ. 25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10వేలు అందజేశారు. భాగ్యశ్రీ, లక్ష్మి బుగుడి ప్రథమస్థానం పొందగా, శ్రీలలిత ద్వితీయస్థానం, గగన్ తృతీయస్థానం పొందారు. వాణిజ్య విభాగంలో అరిహంత్, హర్షిత జైన్, రిదిజైన్ సాయిశరణ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో గ్రూప్ ఇనిస్టిట్యూషన్ ప్రిన్సిపాల్ మోహన్‌రావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



గంజాయి విక్రేతను హాజరుపరచిన పోలీసులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 28: తోరణగల్లు రైల్వే స్టేషన్ సమీపంలో అంకాలమ్మ గుడి వద్ద నివాసం వుంటున్న సంజీవ్‌కుమార్ సింగ్ అనే వ్యక్తి ఒకటిన్నర కిలోల గంజాయిని అక్రమంగా విక్రయించేందుకు తీసుకెళుతుండగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అతనిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆశారాణి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జగదీష్, వెంకన్నరెడ్డి, ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి శ్రీరాములు

నీకు మిగిలేది చెంబే!

- రాహుల్ వ్యాఖ్యలపై శ్రీరాములు ఎద్దేవా

బళ్లారి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి ఈ ఎన్నికల తరవాత మిగిలేది చెంబేనని, ఇక ఆయన ఖాళీ చెంబు పట్టుకుని ఇంట్లో ఉండాల్సిందేనని మాజీ మంత్రి, బళ్లారి బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బాగంగా ఆదివారం విజయనగర సభలో శ్రీరాములు మాట్లాడారు. బళ్లారిలో రాహుల్ పర్యటనకు అసలు జనమే లేరని పేర్కొన్నారు. అదిచూసి రాహుల్ ఎయిర్‌పోర్టు నుండే వెళ్లిపోతుంటే కాంగ్రెస్ నాయకులు బ్రతిమిలాడి రప్పించుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బ్రెయిన్ లెస్ పార్టీ అని అన్నారు, బీజేపీ, జేడీఎస్‌కు ఇప్పుడు జనార్దన్‌రెడ్డి కూడా తోడు కావడంతో బీజేపీ విజయం ఖాయమైందన్నారు. శివుడుకి త్రిశూలం ఎలాగో ఇప్పుడు బీజేపీ గెలుపుకు ఈ మూడు కీలకమయ్యాయన్నారు. బళ్లారి ఎన్నికల్లో జనం ఖచ్చితంగా బీజేపీని గెలిపిస్తారని పేర్కొన్నారు. జేడీఎస్ నాయకుడు కుమార స్వామి మాట్లాడుతూ, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. రైతులకు పరిహారం కూడా ఇవ్వలేని పరిస్థితిలో సిద్దరామయ్య ఉన్నారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్ విజయేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో కులరాజకీయాలు పెరిగాయని అలాగే రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయన్నారు. అలాగే అవినీతి బాగా పెరింగిందన్నారు. వీరితో పాటు బీజేపీ నాయకులు పలువురు మాట్లాడారు. కాంగ్రెస్‌ను ఓడించాలని బీజేపీకి ఓటు వేయాలని కోరారు. సభకు పెద్దఎత్తున జనం రావడంతో బీజేపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

రాహుల్ ఎందుకు అలిగారు?

- కాంగ్రెస్‌లో రాజకీయ రచ్చ
- ప్రజలను రెచ్చగొడుతూ మాట్లాడిన మంత్రిపై పోలీసుల అసహనం
- సభకు జనం రాకపోవడంపై ఆరా



బళ్లారి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న బళ్లారిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ బహిరంగ సభకు అనుకున్నంత మంది జనం రాకపోవడానికిగల కారణాలపై కాంగ్రెస్ అగ్రనాయకులు ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. రాహుల్ గాంధీ బళ్లారి జిల్లాలోని జిందాల్ ఎయిర్ పోర్టుకు వచ్చి అక్కడి నుండి అటే వెళ్లిపోవాలని తిరిగి విమానం ఎక్కారు. బళ్లారిలో రాహుల్ గాంధీ పాల్గొనే సభకు జనం ఇంకా రాలేదని ఇక్కడ ఆయనకు కావల్సినవారు సమాచారం ఇచ్చారని తెలిసింది. ఎస్‌పీజీ పోలీస్ బృందం ఒకటి ముందుగానే బళ్లారిలో రాహుల్ గాంధీ పాల్గొనే సభాస్థలానికి చేరుకుంది. అక్కడి నుండి సాంకేతిక పరికరాల ద్వారా జిందాల్‌లో ఉండే రాహుల్‌కు ఇక్కడి సీన్ అంతా కళ్లకు కటినట్లు చూపించారు. ముఖ్యంగా ఎండలు ఎక్కువగా ఉండడంతో జనం అనుకున్న సమయానికి సభాస్థలానికి రాకుండా పోయారని కాంగ్రెస్ లీడర్ల వాదన. కానీ అసలు జనం తరలింపు, మోటివేషన్ విషయంలో కాంగ్రెస్ నాయకులు పెద్దగా పట్టించుకోలేదని కొందరు అంటున్నారు. ఈ కార్యక్రమాన్ని ఫ్లాప్ చేస్తే రాహుల్ వద్ద మంత్రి నాగేంద్రకు చెడ్డపేరు వస్తుందని కూడా కొందరు కుయుక్తులు పన్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వాస్తవానికి బళ్లారిలో 26న జరిగే ఎన్నికల బహిరంగ సభకు దక్షిణాది జిల్లాలో ఉండే ఎంపీ అభ్యర్థులతోపాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీ.కే శివకుమార్ ఇతర కాంగ్రెస్ నాయకులు హాజరవుతారని కాంగ్రెస్ భారీగా ప్రచారం చేసింది. కానీ రాహుల్ గాంధీ మాత్రమే వచ్చారు. అదికూడా ఆయన బళ్లారికి రాకుండానే జిందాల్ నుండి అటు నుంచి అటే వెళ్లిపోవడానికి హెలీక్యాప్టర్‌లో కూర్చున్నారు. గత్యంతరం లేక కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీకే హరిప్రసాద్, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కలగ జేసుకుని కొద్దిగా లేట్ అయినా బళ్లారి సభకు వెళ్లాలని లేకుంటే పార్టీకి నష్టం జరుగుతుందని విన్నవించుకున్నారని తెలుస్తోంది. ఆదేరోజు రాత్రి డిల్లీలో ముఖ్య సమావేశంలో రాహుల్ పాల్గొనాల్సి ఉంది. అందుకే ఇక్కడ ఆలస్యం అయితే అక్కడ పాల్గొనేందుకు వీలు కాదనే భావనతో ఆయన వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. కానీ బళ్లారి సభలో జనం లేక ఖాళీ కుర్చీలు ఉండడాన్ని రాహుల్ కు గూడాచారి వర్గాలు తెలియజేయడంతో ఆయన 'ఏ క్యా హై! అద్మీనహీ హై అబీ కబిమిల్తే షైనే డిల్లీకో జానీ పడతా' అని అన్నట్లు సమాచారం. చివరకు కాంగ్రెస్ నాయకులు బ్రతిమిలాడుకోవడంతో బళ్లారి సభకు వచ్చారని తెలిసింది. ఎందుకు ఇలా జరిగిందని, జనం ఎందుకు రాలేదని బళ్లారి కాంగ్రెస్ సభ పై కాంగ్రెస్ పెద్దలు ఆరా తీస్తున్నారు. అసలు ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సమన్వయం ఉందా..? అనే విషయంపైనా విశ్లేషిస్తున్నారు. బళ్లారిలో కాంగ్రెస్‌కు మంచి పట్టు ఉన్నా జనం ఎందుకు రాకుండా పోయారనే విషయాలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం రాబట్టినట్లు తెలిసింది.

మొత్తం మీద మంత్రి నాగేంద్ర కూడా కొంత ఆవేశానికి లోనై ప్రతిపక్ష పార్టీలు జనం రాకుండా చేస్తున్నాయని, గేట్లు దాటి జనం లోపలకు రావాలని చేసిన ప్రసంగం పోలీసులకు కొంత ఇబ్బంది కలిగించింది. పైగా జనం మధ్యలోకి సిటీ ఎమ్మెల్యే, మరికొందరు కార్పొరేటర్లు వెళ్లడంతో మరికొంత అసహనానికి లోనయ్యారు. జనంలో లీడర్లకు ఏమైనా జరిగితే చెడ్డపేరు వస్తుందని పోలీసుల వాదన. మొత్తంమీద బళ్లారిలో రాహుల్ పర్యటన వెనుక నడిచిన కథపై ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం రాబట్టాయని తెలుస్తోంది.

ఒక్కటైన 92 జంటలు

కంప్లి, ఏప్రిల్ 28: కంప్లి నియోజకవర్గంలోని సోమలాపురం గ్రామంలో సద్గురు చిదానంద మహాస్వాముల 32వ వర్ధంతి సందర్భంగా సోమలాపురం స్వామి మఠం వద్ద ఆదివారం 92 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. ఒక్కటైన జంటలను చిదానంద స్వాములు, జడేశ్వర స్వాములు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ప్రతి యేటా చిదానంద స్వాముల పుణ్యారాధన సందర్భంగా పేద కుటుంబాల వారికి సామూహిక వివాహాలు జరుపుతున్నామన్నారు. అలాగే ఎమ్మెల్యే గణేష్, మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు ఈ సామూహిక వివాహాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. సామూహిక వివాహాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న చిదానందస్వామి, జడేశ్వరస్వామి

నేడు కూడ్లిగిలో కాంగ్రెస్ బహిరంగ సభ



ప్రజాధ్వని బహిరంగ సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 28: బళ్లారి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం ఆధ్వర్యంలో ప్రజాధ్వని బహిరంగ సభ సోమవారం ఉదయం కూడ్లిగిలో జరగనుంది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం శివకుమార్ హెలికాప్టర్‌లో కూడ్లిగికి రానున్నారు. ఆదివారం ఉదయం కూడ్లిగి ఎమ్మెల్యే శ్రీనివాస ప్రజాప్రతినిధులు బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. గుడేకోట్ రోడ్డులోని కూడ్లిగి ఎమ్మెల్యే ప్రజా సంబంధాల కార్యాలయం పక్కనే హెలిప్యాడ్‌ను నిర్మించారు.

భరత్ రెడ్డి విస్తృత ప్రచారం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 28 : బళ్లారి నగరంలో పలు వార్డుల్లో సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ఆదివారం విస్తృత ప్రచారం చేపట్టారు. నారా భరత్ రెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలు కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీలతోపాటు ఎన్నికల్లో విజయం సాధిస్తే మరిన్ని అభివృద్ధి పథకాలు అందిస్తారని తెలిపారు.

కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నందీష్, వన్నప్ప, కాంగ్రెస్ ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హోసూరు జోన్

డీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం



తాటిముంజలు, అరటిపండ్లు, పనసతొనలు అందజేస్తున్న మేయర్ సత్య

హోసూరు, ఏప్రిల్ 28: వేసవిలో ఎండలనుంచి దాహార్తిని తీర్చేలా రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. రెండురోజులక్రితం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా, తాజాగా డీఎంకే ఆధ్వర్యంలో కూడా చలివేంద్రం ఏర్పాటు చేయడంపట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. సేవా కార్యక్రమాల్లో పార్టీలు ఇలా పోటీ పడి ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సూచన మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం చలివేంద్రం ప్రారంభించిన మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై ప్రకాశ్ ప్రారంభించి తాటిముంజలు, కీరదోస, అరటిపండు, పుచ్చకాయతోపాటు ప్రస్తుత సీజన్‌లో లభించే పనసతొనలను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మురుగన్, కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు ఎల్లోరమణి, పన్నుల స్థాయిసమితి అధ్యక్షుడు చెన్నీరప్ప, ధనలక్ష్మి, శాంతి, జిల్లా యువత సుమన్, శ్రీనివాసులు, నిర్వాహకులు, మునిరమయ్య, కరుణానిధి, తిమ్మరాజ్, సురేశ్, బాలాజీ, మల్లేశ్, శ్రీనివాసన్, మూర్తి, బాలసుబ్రహ్మణ్యం, నాగరాజ్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ మేవాల్డ్ అరెస్టు

హోసూరు, ఏప్రిల్ 28: హోసూరు మత్తిగిరి సమీపంలోని రాయల్ టౌన్‌కు చెందిన మేవాల్డ్ (57) నవది ప్రాంతంలో క్రిస్టియన్ ఫాదర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ప్లస్ టూ పూర్తి చేసి నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న 17 ఏళ్ల నేపాలీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై బాధితురాలి జిల్లా బాలల సంరక్షణ కమిటీకి ఫిర్యాదు చేసింది. దీనిపై హోసూరు మహిళా పోలీసులు ఆరా తీసి పోక్సో చట్టం క్రింద మేవాల్డ్‌ను అరెస్టు చేశారు. ఒక మతప్రచారకుడు ఇలా లైంగిక ఆరోపణల కేసులో అరెస్టు కావడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది.

పెళ్లి లారీ బోల్తా - ఇద్దరు మృతి



లారీ బోల్తాపడిన దృశ్యం

కంప్లి, ఏప్రిల్ 28 : కరుగోడు తాలుకా పట్టణచెరుగు గ్రామానికి చెందిన భాగ్యమ్మ (45), మారెమ్మ (55)లు ఆదివారం లారీ బోల్తా పడి మృతి చెందారు. దీనిపై కుడితిని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణశెరుగు నుండి ఆంధ్రప్రదేశ్‌లోని కెర్నాల్‌కు శనివారం కేఏ 28 డి 5570 నెంబర్ గల లారీలో వివాహానికి కొందరు బయలుదేరారు. వివాహం ముగించుకుని ఆదివారం తిరుగు ప్రయాణంలో ఏళుబెంచి వద్ద గల హెచ్చెల్సీ కాలువ వద్ద మలుపు తిరిగే సమయంలో డ్రైవర్ అజాగ్రత్త వల్ల లారీ బోల్తా పడింది. అందులో పది మందికి గాయాలు కాగా భాగ్యమ్మ, మారెమ్మకు బలమైన గాయాలు కావడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. పెళ్లి తంతు ముగించుకుని వచ్చే సమయంలో ఈ సంఘటన జరగడంతో కుటుంబీకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ విశ్వనాథ్ తెలిపారు.

వ్యవసాయంలో రాణిస్తున్న విద్యార్థి శివకుమార్



అధిక బరువు తూగుతున్న పుచ్చకాయలను చూపుతున్న శివకుమార్

కంప్లి, ఏప్రిల్ 28 : వ్యవసాయంలో కేవలం రైతులు మాత్రమే కాకుండా వ్యవసాయ విద్యార్థులు కూడా పోటీ పడుతున్నారు. వ్యవసాయంపై శిక్షణ పొందిన తమ విజ్ఞానంతో ముందడుగు వేస్తూ తమ పొలాల్లో పంటలు ఏపుగా పెంచుతూ గుర్తింపు పొందుతున్నారు.

కూడ్లిగి తాలుకా కానాహోసళ్లి సిద్దాపురం గ్రామానికి చెందిన శివ కుమార్ డిప్లమో పూర్తి చేసుకుని వ్యవసాయ రంగంలో ముందడుగు వేస్తున్నారు. తమ ఆరు ఎకరాలలో పుచ్చకాయ పంటను సాగు చేసి పంటను ఏపుగా పెంచి భారీగా ఆదాయం ఆర్జిస్తున్నారు. చదువుల్లో రాణిస్తున్న శివకుమార్ వ్యవసాయ రంగంలో కూడా రాణించడంతో గ్రామంలోని రైతన్నలు వ్యవసాయ శాఖ అధికారులు అతడిని అభినందించారు. రబీలో పుచ్చకాయ పంట సేద్యం చేపట్టి దిగుబడి కూడా పుష్కలంగా రావడంతో శివకుమార్ తల్లిదండ్రులు కుమారుడిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా మంత్రి నాగేంద్ర ప్రచారం

సిరుగుప్ప, ఏప్రిల్ 28 : బళ్లారి తాలుకాలోని మోకా సమీపంలో సింధువళం, జాలేహాళ్, గోనాళ్, బ్యాలచింత తదితర గ్రామాలలో లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపుకోసం మంత్రి నాగేంద్ర, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం ప్రశాంత్ విస్తృత ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీలతో ప్రజలు సంతృప్తిగా వున్నారని కావున కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేసి లోక్‌సభ అభ్యర్థి తుకారామ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు అసొండి వన్నూరప్ప, మంత్రి సోదరుడు వెంకటేష్ ప్రసాద్, గాదెలింగన గౌడ, తిమ్మన్నగౌడ, ఈరణ్ణ, రాఘవేంద్ర ప్రచారంలో పాల్గొన్నారు.



సింధవళంలో ప్రచారం చేస్తున్న మంత్రి నాగేంద్ర